ప్రజాశక్తి
బుధవారం 10 జులై 2024
5
అనంతపురం





సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్, తదితరులు



సమస్యలపై.. వాడీవేడి చర్చ...!

- గత ప్రభుత్వ పాలనపై టిడిపి ఎమ్మెల్యేల ప్రశ్నల వర్షం
- పింఛన్లపై టిడిపి, వైసిపి సభ్యుల వాదోపవాదాలు
- కొందరు అధికారులు అవినీతికి పాల్పడ్డారు.. : జెడ్పీ చైర్‌పర్సన్
- అవినీతిపై విచారణ జరిపిస్తాం : కలెక్టర్
- ప్రశ్నలు.. సమాధానాలతో సాగిన జెడ్పీ సమావేశం

ప్రజాశక్తి - అనంతపురం అర్బన్

174 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత జరిగిన ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడంతో జెడ్పీలో కాస్తా భిన్న పరిస్థితులు కన్పించాయి. గతంలో అందరూ సభ్యులు వైసిపి వారే ఉండేవారు. ప్రస్తుతం టిడిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉండడంతో సమాశం వాడీవేడిగా సాగింది. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన మంగళవారం ఉదయం జెడ్పీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బికె.పార్థసారథి, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, జెసి.అస్మిత్ రెడ్డి, ఎంఎస్.రాజు, పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణిశ్రీ, కందికుంట వెంకటప్రసాద్, అనంతపురం జిల్లా కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి తదితరులు పాల్గొన్నారు.



అంబికా లక్ష్మీనారాయణ



కాలవ శ్రీనివాసులు



అమిలినేని సురేంద్రబాబు

పింఛన్లపై వాదోపవాదాలు

ఎన్డీఏ కూటమిలో పింఛన్ల పెంపుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ సభ్యులు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమయంలో కొందరు వైసిపి జడ్పిటిసిలు టిడిపి అధికారంలోకి వచ్చాక కొన్ని పింఛన్లు తొలగించారని, దీని వల్ల లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ విషయాన్ని హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి ఖండించారు. వైసిపి జెడ్పీటీసీల వాదనను తిప్పికొట్టారు. ఈ సమయంలో టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. వాలంటీర్ల విషయంపై ఎన్నికల్లో వైసిపికి పనిచేసిన వాలంటీర్లతో పనిచేయచ్చుకోవాల్సిన అవసరం తమకు లేదని టిడిపి ఎమ్మెల్యేలు తెలిపారు. గతం కంటే మిన్నగా అర్హులందరికీ ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంచామని తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజులు సమాధానం ఇచ్చారు. వైసిపికి పని చేసిన వాలంటీర్లతో తాము ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేసేది లేదని స్పష్టం చేశారు.



పల్లె సింధూరరెడ్డి



దగ్గుపాటి ప్రసాద్



బండారు శ్రావణిశ్రీ



ఎంఎస్.రాజు

ప్రొటోకాల్‌పై వివాదం

సభ్యులు, ప్రజా ప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారంటూ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పందిస్తూ ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులకు అధికారులు గౌరవం ఇవ్వాలన్నారు. ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్‌ను కోరారు. దీనిపై విచారణ జరిపిస్తామని కలెక్టర్ తెపారు. అనంతరం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు సమస్యలపై ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు.

'గత ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం'

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత ఐదేళ్లుగా అభివృద్ధి పడకేసిందని టిడిపి ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. అభివద్ధి కేవలం కాగితాలకే పరిమితం అయ్యిందని విమర్శించారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ పరిధిలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అభివద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. కరువు జిల్లాగా పేరుగాంచిన అనంతపురం జిల్లాలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం కేవలం మాటలతోనే సరిపెట్టిందన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలో పలువురు వైసిపి శాసనసభ్యులు గ్రామాలకు వెళ్లే తాగునీటి పైపులను తమ బోరుబావులకు మళ్లించుకున్నారని ఆరోపించారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు కృష్ణా జలాల బోర్డును రాయలసీమలో ఏర్పాటు చేయాలని కోరగా దీనికి హిందూపురం ఎంపి బికె.పార్థసారథి మద్దతు తెలిపారు.

అధికారులు అవినీతికి పాల్పడ్డారు... జెడ్పీ చైర్‌పర్సన్

గత ప్రభుత్వంలో నిధులు సక్రమంగా మంజూరు కాలేదని అందువల్లే అభివృద్ధి పనులు జరగలేదని కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ విషయమై జెడ్పీ పర్సన్‌బోయ గిరిజమ్మ జోక్యం చేసుకుని మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు సక్రమంగా బిల్లులు మంజూరైనట్లు తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో అప్పుడు విధులు నిర్వహించిన జెడ్పీ సిఇఒ, డిప్యూటీ సిఇఒలు అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. ఆర్‌డబ్ల్యుఎస్ పరిధిలో నిధులు మంజూరు చేసినా, సంబంధిత అధికారులు పనులు చేయలేదన్నారు. దీనిపై విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరారు.

విచారించి చర్యలు తీసుకుంటాం.. : కలెక్టర్

ఎన్డీఏ కూటమి ప్రభుత్వ నిర్ణయాలను పాటిస్తామని అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన పనులకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై తనకు నివేదిక ఇవ్వాలంటూ జెడ్పి సిబ్బంది, చైర్‌పర్సన్‌కు సూచించారు. ప్రజా ప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించాలన్నారు. జిల్లా ప్రజా పరిషత్‌లో ఇప్పటివరకు జరిగిన ప్రతి అంశంపై నివేదిక తీసుకుని విచారించి తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సచివాలయాలు కొన్ని పూర్తి చేసుకుని, మరికొన్ని అసంపూర్తిగా నిలిచిపోయాయని చెప్పారు.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పామిడి

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మండల కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఎండిపిఒ కార్యాలయంలో ఎపిఒ మల్లేశ్వరికి వ్యకాసం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న ఆరు వారాల వేతనాలు చెల్లించాలని, పనిముట్లు, పే స్లిప్పులు ఇవ్వాలని, ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పనుల వద్ద కనీస సౌకర్యాలు, నీడ, నీళ్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని, కూలీ కుటుంబ సభ్యులందరికి బీమా సౌకర్యం కల్పించాలని, అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని, రాజకీయ జోక్యం ఆపాలని, 200 రోజుల పనులు కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలంలోని కిష్టిపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణన్నారాయణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆది, రంగస్వామి, పెద్దయ్య, రంగయ్య, ఆచారి, బాలకృష్ణ, సావిత్రి, శిరీషా, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

నత్తనడకన గ్రామీణ రహదారులు

- సత్యసాయి జిల్లాలో 21 శాతం పనులే పూర్తి
- రూ.88.02 కోట్ల బకాయి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గ్రామీణ రహదారుల నిర్మాణపు పనులు నత్తనడకన నడుస్తున్నాయి. సత్యసాయి జిల్లాలో నత్తనడకన పనులు నడుస్తున్నాయి. అంతకు మునుపు ఆర్థిక సంవత్సరం పనులు ఎక్కడిక్కడే అన్న చందంగా మారాయి. మొత్తం పనుల్లో 21 శాతం కూడా ఈ ఒకటిన్నర సంవత్సరం కాలంలో జరగలేదు. పనుల పురగతిపైనే ప్రజాప్రతినిధులు జిల్లా పరిషత్ సమావేశంలోనూ ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం.

21 శాతమే పనులు పూర్తి

సత్యసాయి జిల్లాలో 2023-24 సంవత్సరంలో 3079 పనులు మంజూరయ్యాయి. వీటి విలువ రూ.727.13 కోట్లు విలువైన పనులు మంజూరైన వాటిల్లోనున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 314 పనులు మంజూరయ్యాయి. వీటి విలువ రూ.33.81 కోట్లు ఉన్నాయి. 3393 పనులు రూ.751.54 కోట్ల విలువైన పనులు మంజూరైన వాటిల్లోనున్నాయి. ఇందులో ఇప్పటి వరకు పూర్తయిన పనులు 734. వాటి విలువ రూ.254.99 కోట్లు. అయితే ఇందులో మొత్తంగా చూసిప్పుడు ఇప్పటి వరకు పూర్తయిన పనులు 21 శాతం మాత్రమే. ఇందులో అత్యధికంగా పూర్తయినవి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సిసి రహదారులున్నాయి.

రూ.88.02 కోట్లు బకాయిలు

మొత్తం చేసిన పనుల్లోనూ అత్యధికం బిల్లులు బకాయిలుండటం గమనార్హం. 2023-24 సంవత్సరంలో రూ.254.99 కోట్లు పనులు చేయగా, ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.58.06 కోట్లు కలిపి మొత్తం రూ.313.06 కోట్లు పనులున్నాయి. ఇందులో ఇప్పటి వరకు రూ.88.02 కోట్లు బకాయిలున్నాయి. అత్యధిక బకాయి ఉన్న పనుల్లో ఎపిఆర్‌ఆర్‌పి పనులు చేపట్టిన వాటిల్లో బకాయిలు రూ.22.73 కోట్లు. ఎఎంసి రహదారుల చేసిన పనులు రూ13.22 కోట్లు, సిసి రహదారులు రూ.19 కోట్లు. బిటి రహదారులు రూ.8.14 కోట్లు ఇలా అన్ని కలిపి రూ.88 కోట్లు బకాయిలున్నాయి.



పాత బకాయి బిల్లులు అయ్యేనా ?

వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన బిల్లులకు ఇప్పుడు ఈ ప్రభుత్వం ఏ మేరకు బిల్లులు మంజూరు చేస్తుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఎన్నికల ఫలితాల తరువాత నుంచి బిల్లులు ఆప్‌లోడ్ చేసేందుకు కూడా వీల్లేకుండా ఆన్‌లైన్‌లో ఆప్షన్ లేకుండాపోయిందని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. అనేక శాఖల్లోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొంది. అంతకు మునుపు 2019లో వైసిపి ప్రభుత్వమొస్తూనే టిడిపి నాయకులకు సంబంధించి బిల్లులు చెల్లింపులను నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా ఇదే తరహాలో పెండింగ్‌లో పెడితే తమ పరిస్థితి ఏమిటని పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సేవలు ఆదర్శం

మేవా ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న మేవా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉద్యోగులు, ఉపాధ్యాయులుగా ప్రజలు, విద్యార్థులకు అందించిన సేవలు ఆదర్శనీయమైనవని మేవా జిల్లా అధ్యక్షులు సుగమంచి సురేష్‌బాబు, మేవా జిల్లా ప్రధాన కార్యదర్శి అహోబిలేష్ కొనియాడారు. జిల్లాలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మేవా ఆధ్వర్యంలో మంగళ వారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉద్యోగుల జీవితంలో విధినిర్వహణతో సమాజానికి సేవ చేస్తూ సగ జీవితం పూర్తయిందని, మిగతా జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షిస్తూ అభినందించారు. పదవీ విరమణ పొందిన వారిలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పి.జ్ఞాన సుందరం, కె.ఎస్తేరు, ఎస్.భాస్కర్, జె.రామన్న, ఎం.ఓబులేసు, చింతలయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దల్ సుగమంచి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

10న కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కర్షక, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వతేదీన జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపూర్ రూరల్ మండలం ఐఎంఎల్ డిపోలో పని చేస్తున్న హమాలీలతో కలిసి ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిన నేపత్యంలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ గత ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా పని చేశాయన్నారు. దీంతో ఆయా ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ బలాన్ని బాగా తగ్గించారన్నారు. ఇందుకు ప్రధాన కారణం కార్మిక, కర్షక ఉద్యమాల ఫలితమే అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఇతరుల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగొచ్చి కర్షక, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి, హమాలీ యూనియన్ నాయకులు నాగార్జున, మోహన్‌బాబు, రమణ, రాజు, ప్రసాద్, దేవేందర్‌రెడ్డి, వేణు, అజయ్‌కుమార్, చెన్నారెడ్డి, హమాలీలు పాల్గొన్నారు.



హమాలీలతో కలిసి పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు రామాంజనేయులు

జీవో 117ను రద్దు చేయాలి : యుటిఎఫ్



సభ్యత్వ నమోదు చేస్తున్న యుటిఎఫ్‌నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

విద్యారంగానికి అవరోధంగా తీసుకొచ్చిన జీవో 117ను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రమణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు జంతలూరు, చెదుల్లా, నీలంపల్లి, రోటరీపురం, తదితర పాఠశాలల్లో యుటిఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోందన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. దీనికితోడు జీఓ 117ను మరింత ఇబ్బంది తెచ్చి పెడుతోందన్నారు. కావున వెంటనే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పిఆర్‌సి అమలు చేయాలని, అంతవరకూ 25 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, పాఠశాలల గ్రాంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివిధ రకాల యాప్‌లను రద్దు చేసి ఉపాధ్యాయులు బోధనపై శ్రద్ధ చూపేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు వి.హెన్రీమార్క్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మహమ్మద్‌గౌస్, సి.పవన్‌కుమార్, కె.బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కొలతలు వేయాలి



వినతిపత్రం సమర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం రూరల్ మండల పరిధిలోని కురుకుంట గ్రామం సర్వే నెంబర్ 41-డి, 41-3, 41-3బిలో ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలకు ఇచ్చిన ఇళ్లస్థలాలను తక్షణమే కొలతలు వేసి అప్పగించాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ బిసిఆర్.దాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పట్టాలున్న వారికి మాత్రమే సర్వే చేసి ఇళ్ల స్థలాలు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారని, ఆ మేరకు సర్వే చేసి ఇళ్ల స్థలాలు చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు రాము, ఎంఎస్ఎఫ్ శివ, కిషోర్ పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ శిక్షణ భాగస్వామిగా 'గేట్స్'

ప్రజాశక్తి-గుత్తి

ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్ స్థానిక గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలను తమ శిక్షణ భాగస్వామిగా ఎంచుంది. ఈ మేరకు మంగళవారం గేట్స్ కళాశాలతో ఇన్ఫోసిస్ కంపెనీ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చదివే విద్యార్థులకు ఇన్ఫోసిస్ శిక్షకులు వెబ్ డెవలప్మెంట్ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇన్ఫోసిస్ కంపెనీ ఉద్యోగాలు తోపాటు నగదు బహుమతులు అందజేయనున్నారు. ఇందులో భాగంగా గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ జి.రఘునాథరెడ్డి అంగీకారపత్రాన్ని ఐసిటి అకాడమీ రీజినల్ అధికారి ప్రవీణ్‌కుమార్‌తో అందుకున్నారు. ఇన్ఫోసిస్, ఐసిటి అకాడమీ కంపెనీ దేశవ్యాప్తంగా 48 వేలు మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో భాగంగా రాయలసీమలోనినాలుగు కళాశాలలను తమ శిక్షణ భాగస్వాములుగా ఎన్నుకున్నారు. ఇందులో గేట్స్ కళాశాల ఉండడం ఎంతో ఆనందదాయకమని గేట్స్ కళాశాల ఎండి జి.రఘునాథరెడ్డి అన్నారు. అలాగే గేట్స్ కళాశాల మాంగో డిపి అనే డేటాబేస్ కంపెనీతో కూడా ఒప్పందం దాదాపు ఖరారైందనిచెప్పారు. ఒప్పంద ప్రకారం సర్టిఫికేషన్లు, ఉద్యోగాలు పొందే అవకాశాలు గేట్స్ విద్యార్థులకు దక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, ఏవో ఇంతియాజ్, ప్లేస్ మెంట్ అధికారి తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.



ఇన్ఫోసిస్ ప్రతినిధుల నుంచి ఒప్పంద పత్రం అందుకుంటున్న 'గేట్స్' కళాశాల సిబ్బంది



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

సెంట్రల్ పార్కు ఆక్రమణలపై చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని సెంట్రల్ పార్కు ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం నగరంలోని సెంట్రల్ పార్క్ ఆక్రమణలతోపాటు వేణుగోపాల్ నగర్‌లోని ఎన్‌టిఆర్ మార్గ్ రోడ్డు, తదితర ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం అండతో వైసిపి నాయకులు సెంట్రల్ పార్క్ స్థలాన్ని ఇష్టానుసారంగా కబ్జా చేశారన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. అలాగే సెంట్రల్ పార్కు స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇక ఎన్టీఆర్ మార్గ్ రహదారి సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. 15 ఏళ్లుగా ఎన్టీఆర్ మార్గ్ రహదారి సమస్యకు పరిష్కారం చూపి, ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరుస్తామని వివరించారు. రోడ్డును ఆక్రమించిన కట్టడాలను పట్టణ ప్రణాళిక అధికారుల ఆధ్వర్యంలో కూల్చివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ నివారణ

ప్రజాశక్తి-వజ్రకరూరు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే డెంగీ వ్యాధి నివారణ సాధ్యమని వైద్యాధికారులు తేజస్వి, సర్దార్‌వలి సూచించారు. మంగళవారం వజ్రకరూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అప్పుడే అతిసార వ్యాధిని నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గురుప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, సూపర్‌వైజర్ నాగశంకర్, సుశీలమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

అలాగే ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో డెంగీ వ్యతిరేక మాసోత్సవంపై మెడికల్ ఆఫీసర్ ఎల్లోజ్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉరవకొండ మండలంలో సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, బోదకాలు, మెదడువాపు తదితర వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయన్నారు. జులై నెలాఖరు వరకు రోజూ ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.ఎల్లోజీరావు, ప్రభుత్వ వైద్యాధికారులు భరత్, ఇస్మాయిల్, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తల కోదండరామిరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు సాంబశివుడు, ఆశా నాగవల్లి, హెడ్ నర్స్ శశిరేఖ, స్టాఫ్ నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం శేషారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-కణేకల్లు

కణేకల్లు బాలుర హైస్కూల్ హెచ్‌ఎంగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన టి.శేషారెడ్డిని మంగళవారం స్థానిక రామ్‌నగర్‌లో సహచర హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శేషారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు నరసింహులు, జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, ఎంపిడిఒ గురుదెన్న, ఎంఇఒ లక్ష్మన్న, మాజీ ఎంపిపి ఆలేరు రాజగోపాల్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి పాటిల్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ వైస్ సర్పంచి ఆనంద్, నాగిరెడ్డి, కణేకల్ పట్టణ వైసిపి కన్వీనర్ కేశవరెడ్డి, రైస్‌మిల్ చంద్ర, బాగన్న, తిప్పేస్వామి, రమేష్, నాయకులు తిమ్మప్పచౌదరి, ఆదినద్దుడు, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



శేషారెడ్డిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు, నాయకులు

వైసిపి నేతల అక్రమాలు బయటపెడతాం

గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి-గుత్తి

వైసిపి నాయకుల అవినీతి, అక్రమాలను త్వరలో బయటకు తీస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుత్తి మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. తన అన్న గుమ్మనూరు జయరామ్ గెలుపులో గుత్తి మండలం నుంచి అత్యధిక మెజార్టీ తెచ్చిన తనపై వైసిపి నాయకుడు సుంకప్ప అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

సుంకప్ప ఓ అమ్మాయికి సినిమా ఛాన్స్ ఇస్తామని మోసం చేసి ఆమె మృతికి కారణమయ్యాడని ఆరోపించారు. గుంతకల్లు పట్టణ శివారులోని ధోనిముక్కల రోడ్డులో పేదల కేటాయించిన ఇళ్ల స్థలాలను సుంకప్ప కబ్జా చేశాడని అన్నారు. సుంకప్ప చేసిన అవినీతి బండారం ప్రజలందరికీ తెలుసు అన్నారు. వైసిపి నాయకుల అవినీతి, అక్రమాలను బయటకు తీసి వారందరినీ జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎంకే.చౌదరి, జక్కలచెరువు ప్రతాప్, రఘు, రమేష్, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వే డే

పామిడి : సర్వే డేను పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, మండల సర్వేయర్లు మురళీధర్‌నాయక్, వలి, విలేజ్ సర్వేయర్లు కుమార్, శ్రీకాంత్, నిరంజన్‌రెడ్డి, దినేష్, రవికుమార్, బాబా, మంజునాథ్, రవికిరణ్, నాగేంద్ర, రాహుల్, నందకుమారి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-బ్రహ్మ సముద్రం

గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2, 3వ త్రైమాసికంలో ఉన్న గర్భిణులకు అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎవరికైనా రక్తం తక్కువగా ఉంటే ఐరన్ సుక్రోజ్ ఎక్కిస్తామన్నారు. అదేవిధంగా హిమోగ్లోబిన్, మలేరియా, బ్లడ్ గ్రూపింగ్, హెచ్ఐవి, వీడీఆర్ఎల్, బ్లడ్ షుగర్, హెచ్‌బీఎస్ ఏ.జీ, యూరిన్ ఆల్బుమెన్ షుగర్ వంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ మేరి, హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మి, వైద్యసిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.



గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రాజేష్‌కుమార్

గూగూడు కుళ్లాయిస్వామి అగ్నిగుండం ఏర్పాటు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్నిగుండం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయ అర్చకులు హుసేనప్ప ప్రత్యేక ప్రార్థనలు చేసి అగ్నిగుండం ఏర్పాటు పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులందరూ కలిసి కుళ్లాయిస్వామి అగ్నిగుండం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గతేడాది అగ్నిగుండం లోపల వేసిన మల్లెపూలు ఏడాది అయినా వాడిపోకపోవడంతో భక్తులు ఆసక్తిగా తిలకించారు. రేపు ఉదయాన్నే కుళ్లాయిస్వామి ఆలయంలో పీర్లు కొలువు దీరనున్నట్లు ఆలయ అర్చకులు హుస్సేనప్ప తెలిపారు. నేటి నుంచి నిత్య నివేదన పూజలు ఉంటాయన్నారు.



కుళ్లాయిస్వామి అగ్నిగుండాన్ని తవ్వుతున్న భక్తులు

నూతన బోరు పనులు ప్రారంభం

బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో సర్పంచి రమణకుమారి శివయ్య నూతన బోరు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక సబ్‌స్టేషన్ వద్ద భూమిపూజ చేసి బోరు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాముడు, ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

మాజీ ఎంపీ తలారి రంగయ్య

ప్రజాశక్తి-కుందుర్పి

కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని.. అండగా తానుంటానని మాజీ ఎంపీ తలారి రంగయ్య భరోసా ఇచ్చారు. 20 రోజుల క్రితం మలయనూర్ గ్రామానికి చెందిన పూజారి లక్ష్మీకాంతంపై తెలుగు తమ్ముళ్లు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మంగళవారం పోలీసుల సమక్షంలో లక్ష్మీకాంతంను పరామర్శించారు. అనంతరం రూ.50వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో కార్యకర్తలను పరామర్శించడానికి కూడా స్వేచ్ఛ లేకపోవడం బాధాకరమన్నారు. పోలీసు యంత్రాంగం అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలు దగడం మంచిది కాదన్నారు. వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్తగా గ్రామాల్లో తిరిగి కార్యకర్తలకు భరోసా కల్పించే హక్కు కల్పించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వారు నాయకులు, కార్యకర్తలను స్వేచ్ఛగా కలవడానికి ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గోవిందమ్మ ఓబన్న, మాజీ సర్పంచి సుదర్శన్‌రెడ్డి, ఎంపిపి కమల నాగరాజు, మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, వైసిపి సీనియర్ నాయకులు మాదినేని ఉమామహేశ్వరనాయుడు, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కంటి జబ్బులను అశ్రద్ధ చేయొద్దు..

ప్రజాశక్తి-పామిడి

ఎవరూ కంటి జబ్బులను అశ్రద్ధ చేయకూడదని డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, డాక్టర్ విరుపాక్షరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో లయన్స్ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషికి కంటి చూపు లేకుంటే భవిష్యత్తు అంధకారమే అన్నారు. దేహానికి దీపం కళ్లు అన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ కళ్లను కాపాడుకోవాలన్నారు. అనంతరం కంటి వైద్య నిపుణులు డాక్టర్ సాహేల్ 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వీరిలో 123 మందిని కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఆపరేషన్లకు ఎంపికైన వారిని బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రికి బస్సులో తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ రోఖియా బేగం, జిలాన్, వైస్ గవర్నర్ విరూపాక్షరెడ్డి, పీసే.జయరామ్‌రావు, కోశాధికారి షేక్షావలి, డాక్టర్ మురళి, డైరెక్టర్లు గంగ శేఖర్, పీసే.సుహన్, పీసే.కిరణ్, ముండే షేక్షావలి, పట్రా శ్రీనివాసులు, గుత్తి లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసులు, వాసవీ కళ్యాణ మండపం గౌరవ అధ్యక్షుడు ఉపేంద్ర, శివప్రసాద్, శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజర్ శివప్రకాష్, శంకర ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ఇంజినీరింగ్ శాఖలో విలీనం చేయాలి

ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి సచివాలయ ఇంజినీర్ల వినతి

ప్రజాశక్తి-శింగనమల

సచివాలయ ఇంజినీర్లను ఇంజినీరింగ్ శాఖలోకి విలీనం చేయడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సచివాలయ ఇంజినీర్లు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం అనంతపురంలోని స్వగృహంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయ ఇంజినీర్లు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన అన్ని రకాల పునలు చేస్తున్నప్పటికీ సరైన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. అంతేగాకుండా తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నామని వాపోయారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కేవలం పంచాయతీరాజ్ శాఖలో మాత్రమే పని చేసేలాగా అయితే ఎలాంటి ప్రమోషన్లు లేకపోవడంతోపాటు తమ జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతాయన్నారు. కావున మీరైనా స్పందించి సచివాలయ ఇంజినీర్లను ఇంజినీరింగ్ శాఖలోకి విలీనం చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.



ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి వినతిపత్రం సమర్పిస్తున్న సచివాలయ ఇంజినీర్లు

రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-బెలుగుప్ప

రోడ్లకు ఇరువైపులా మొక్కల నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ సుబ్బరాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లతో వివిధ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు మేరకు హార్టికల్చర్ కింద 290 ఎకరాలు ప్రతిపాదించగా మొదటి విడుదల 58 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాల ఆవరణల్లో 400 మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు అధికారి సూర్యప్రకాష్, జూనియర్ ఇంజనీరింగ్ జయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు విజయ్‌కుమార్, నాగేంద్రప్ప, స్వాతి, అరవింద్, కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

మురుగునీటిని తొలగించాలి

మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాల ఆవరణలో కంపుచెట్లను మురుగు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. మంగళవారం స్థానిక కెజిబివి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, కంపు చెట్లను తొలగించి డ్రెయినేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లారెడ్డి, కెజిబివి పాఠశాల ఎస్ఓ నాగరత్నబాయి, విస్తరణాధికారి మాధవరెడ్డి, పంచాయతీ సెక్రటరీ వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

చెట్లే జగతికి మూలం

శ్రీచైతన్య ఎజిఎం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

'చెట్లే జగతికి మూలాధారం, చెట్లే మన మనుగడకు ఆధారం' అని శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీచైతన్య రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం సమతుల్యంగా ఉండటానికి ప్రతి ఒక్కరూ తప్పకుండా మొక్కలను నాటాలన్నారు. ముఖ్యంగా రాయలసీమ రాళ్ల సీమగా మారుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచితే హరిత సీమను చూడవచ్చన్నారు. అనంతరం చిన్నారులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపల్ షమీనా, అకడమిక్ కోఆర్డినేటర్ నాగభూషణం, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీచైతన్య ఎజిఎం సుబ్బారెడ్డి



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కుళ్లాయిస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి సాకేతపురం శోభ తెలిపారు. దేవాదాయ అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో శాశ్వత హుండీలను లెక్కించగా రూ.11,84,310 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే అన్నదానం హుండీలో రూ.2,49,771 వచ్చినట్లు వివరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

జెడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే గళం విప్పారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎంతోపాటు వైద్యం, డ్రెయినేజీ వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

లోకేష్ దృష్టికి బుక్కరాయసముద్రం సమస్యలు



నారా లోకేష్‌తో మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం : నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి, ఐటి మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితులపై చర్చించి అన్నివిధాలా అండగా ఉంటామని లోకేష్ భరోసా కల్పించినట్లు రామలింగారెడ్డి తెలిపారు.

పీర్లపండుగకు అనుమతి తప్పనిసరి

పుట్లూరు : మండలంలోని గ్రామాల్లో మొహర్రం వేడుకలను జరుపుకోవాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ హేమాద్రి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా సున్నితమైన గ్రామాల్లో అనుమతి కావాలంటే సీఐ, డీఎస్పీతో అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పామిడి : పట్టణంలోని 9వ వార్డులో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కుమారుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు 9వ వార్డు ఇన్‌ఛార్జి రంగనాయకులు మంగళవారం వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఎక్కువగా డ్రెయినేజీ సమస్య ఉందని స్థానికులు విన్నవించగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొమ్మా మోహన్, అప్పన్నగారి కుమార్, నల్లబోతుల శీన, సుంకప్ప, శ్రీరాములు, వెంకటరమణ, తిమ్మప్ప, రఫీ, గంపమల్లయ్య, బెస్త హరి, ఆచారి, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.



మురికి కాలువను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

వృద్ధుడు ఆత్మహత్య

పుట్లూరు : మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన బాయినేని ఆంజనేయులు (78) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే... ఆంజనేయులు వృద్ధాప్యం మీద పడటంతోపాటు అనారోగ్యాల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కుమారుడు బాయినేని నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండల పరిధిలోని తొండపాడు గ్రామ శివారులో 67వ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. యాడికి మండలం పిన్నేపల్లికి చెందిన నాగార్జున పని నిమిత్తం గుత్తికి వచ్చాడు. అనంతరం పని ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా తొండపాడు గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగార్జునను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు నాగార్జునను అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే విజయోత్సవ
ప్రత్యేక సంచిక
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనంతపురం జిల్లా
పేజీలు : 4 బుధవారం 10-07-2024



నేడు అనంత కార్పొరేషన్

బడ్జెట్, సర్వసభ్య సమావేశం


దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్
ఎమ్మెల్యే, అనంతపురం


అంబికా లక్ష్మినారాయణ
ఎంపీ, అనంతపురం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ సమావేశం బుధవారం నాడు జరగనుంది. బడ్జెట్, సాధారణ, సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్రంలో

హాజరుకానున్న ఎమ్మెల్యే, ఎంపీ

టిడిపి అధికారంలోకి వచ్చాక తొలిసారిగా కార్పొరేషన్ సమావేశం జరగనుంది. సమావేశానికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. కాగా ఈ సమావేశానికి ఇటీవల నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణలు హాజరుకానున్నారు. కౌన్సిల్ ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సాధారణంగా అర్బన్ ఎమ్మెల్యే అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎక్స్ అఫిషియో సభ్యునిగా బాధ్యతలు చేపట్టటం పరిపాటిగా వస్తోంది. కీలక సమయాల్లో ఎక్స్ అఫిషియో ఓటు ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. కార్పొరేషన్‌లో ఎక్స్ అఫిషియో సభ్యునికి ఓటు హక్కు ఉంటుంది.



నేడు కార్పొరేషన్ బడ్జెట్ మీట్

అందుబాటులో లేని కమిషనర్ - కార్పొరేటర్ల అసంతృప్తి

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా అనంతపురం కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం బుధవారం నాడు జరగనుంది. సమావేశానికి సంబంధించి ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వప్రసాద్ రానున్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో పలు విషయాలు, నగర సమస్యలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ విభాగాల పనితీరు, కమిషనర్ మేఘ స్వరూప్ వైఖరి పట్ల కార్పొరేటర్లలో అసంతప్తి ఉన్నట్లు తెలుస్తోంది. కమిషనర్ను కలిసి చర్చిద్దామంటే అందుబాటులో ఉండటం లేదని వారు వాపోతున్నారు. కమిషనర్‌ను కలవాలంటే సాయంత్రం 6 గంటల పైన మాత్రమే



అనుమతి లభిస్తుండటంతో ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ఆ సమయంలో నగర ప్రజలు తమ సమస్యలు విన్నవించుకోవటానికి కమిషనర్ వద్దకు వస్తుండటంతో రద్దీ వాతావరణం నెలకొంది. దీంతో కమిషనర్‌ను స్వేచ్ఛగా కలిసి విన్నవించుకోవటానికి తమకు అవకాశం లభించటం లేదని కార్పొరేటర్లు మదనపడుతున్నారు. నగరంలో ఇప్పటికీ చాలా డివిజన్లలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాకయి. కొందరు ఇంజినీరింగ్ అధికారుల వ్యవహార శైలి వల్ల సమస్యలను పరిష్కరించుకోలేకపోతున్నామని కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్లో అభివద్ధి పనుల విషయంలో ఒక అడుగు ముందుకేస్తే 20 అడుగుల వెనక్కి అన్న చందనా పరిస్థితి ఉంది. కాంట్రాక్టర్లు సైతం చేసిన పనుల అభివద్ధి పనుల ఫైళ్ల కదలిక మందగమనంలో సాగుతుండటంతో పడరాని పాట్లు పడుతున్నారు. పలుమార్లు కాంట్రాక్టర్లు గ్రూపుగా వెళ్లి కలిసినా చేస్తాం.. చూస్తాం అనే సమాధానమే వస్తున్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి పనుల విషయంలో రోజులు, వారాలు, నెలలు గడపడమే లక్ష్యంగా ముఖ్య అధికారి పనితీరులా కనిపిస్తోందని కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు కొందరు ఇంజినీరింగ్ అధికారుల నడుమ విభేదాల కారణంగా కాంట్రాక్టర్లు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. దీనికి తోడు కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సాక్షాత్తు పాలక సభ్యులే ఆరోపణలు చేస్తుండడం కార్పొరేషన్ ప్రతిష్టను మరింత మసకబారుస్తోంది. ప్రజల నడుమ నిరంతరం సమస్యల పరిష్కారం కోసం తిరిగే తాము కార్పొరేషన్‌లో కోట్లలో అవినీతి జరిగిందంటూ ప్రజలు ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పుకోలేకపోతున్నామంటూ కొందరు కార్పొరేటర్లు నిట్టూర్పు విడుస్తున్నారు. నాలుగు రోజుల క్రితం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో సైతం కమిషనర్ మేఘ స్వరూప్ హాజరుకాలేదు. కోట్ల రూపాయల అవినీతి మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిందా.. లేదా..? అన్న అంశంపై అధికారులు నిజనిర్ధారణ చేసి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే కార్పొరేషన్ అధికార యంత్రాంగం పాలన యంత్రాంగం అవినీతిమయంగా మారిందన్న అపఖ్యాతిని మూటగట్టుకోవాల్సి వస్తోందనే భావన అటు కార్పొరేటర్లు, ఇటు ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో బుధవారం జరిగే మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం, బడ్జెట్ సమావేశంలో వీటిపై చర్చ జరపాలని పలువురు కోరుతున్నారు.

కార్పొరేషన్‌లో ఇన్‌ఛార్జి అసిస్టెంట్ ఇంజినీర్ల పెత్తనం



> **సమీక్ష సమావేశంలో ఇన్‌ఛార్జులదే హవా**
>
> **గోల్లు గిల్లుకుంటున్న రెగ్యులర్ అసిస్టెంట్ ఇంజినీర్లు**
>
> **ఎమ్మెల్యే గారూ.. మీరైనా స్పందించండి**

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ముగ్గురు రెగ్యులర్ అసిస్టెంట్ ఇంజినీర్లు అందుబాటులో ఉన్నా వారిని కాదని వార్డ్ అమ్యూనిటీస్ సెక్రటరీస్ 8 మందిని నియమించుకున్నారు. ఇందులో ఒక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దగ్గర నియమితుడైన వార్డ్ అమినిటీ సెక్రటరీ నియామకం ఇన్‌ఛార్జి ఎస్‌ఈ అనుమతి లేకుండానే నియమించుకున్నట్లు తెలుస్తోంది. అసిస్టెంట్ ఇంజినీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నచోట అమినిటీస్ సెక్రటరీలను మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్‌ప్రకారం వర్క్ అరేంజ్మెంట్ కింద కమిషనర్ నియమించారు. కేవలం అసిస్టెంట్ ఇంజినీర్ల పర్యవేక్షణలో వారు పనిచేయాల్సి ఉంటుంది. ఈ మేరకు వారికి ఐదేసి డివిజన్ల వంతున సివిల్ వర్క్ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సూర్యనారాయణ, సూపరిండెంట్ ఇంజినీర్ రామ్మోహన్ రెడ్డి సిఫార్సుల మేరకు కమిషనర్ మేఘస్వరూప్ ఎనిమిది మంది వార్డ్ అమినిటీ సెక్రటరీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు రోజుల క్రితం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ జరిపిన అధికారుల సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్ విజయ్ కుమార్ తనను తాను ఎమ్మెల్యేకు పరిచయం చేసుకున్నారు. కమిషనర్ మేఘ స్వరూప్ జారీచేసిన ఉత్తర్వుల్లో విజయ్ కుమార్ పేరు ఎక్కడా లేకపోవటం గమనార్హం. ఇంజినీరింగ్ విభాగంలో ఒంటెద్దు పోకడలు పోతూ తనను తాను మోనార్క్‌గా భావించే ఒక డిఈఈ వద్ద విజయ్ కుమార్ అనే వార్డ్ అమ్యూనిటీ సెక్రటరీ పని చేస్తూ ఉండటం గమనార్హం. కమిషనర్ జారీ చేసిన ఇంజినీరింగ్ రెగ్యులర్ అధికారుల పని విభజనలో ఆఫీసు నిర్వహణ గెస్ట్ హౌస్ పార్కులు తదితర పర్యవేక్షణ బాధ్యతలు రెగ్యులర్ అసిస్టెంట్ ఇంజినీర్‌కు కేటాయింపు జరిగింది. సదరు ఏఈ ప్రమేయం లేకుండానే ఆఫీసు నిర్వహణ మొదలుకుని ఇతర అంశాలలో సైతం అంచనాలు తయారు చేయడం వాటిని సిఫార్సు చేయటం ఫర్ ఏఈ పేరుతో ఆ వార్డు కమ్యూనిటీ సెక్రటరీతో డిఈఈ చక్కబెడుతుండటం విశేషం. బిల్లులు అంచనాలను ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆమోదం తెలపటం జరుగుతుంది. ఇంజినీరింగ్ విభాగపు అధిపతి అయిన సూపరిండెంట్ ఇంజనీర్ రామ్మోహన్ రెడ్డి దష్టికి కొందరు కాంట్రాక్టర్లు, అధికారులు తీసుకువెళ్లగా విజయకుమార్ నియామకానికి సంబంధించి తనకెలాంటి సంబంధం లేదని తాము జారీ చేసిన ఉత్తర్వుల్లో ఎక్కడా ఆయన నియామకం జరపలేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. సదరు డిఈఈ నేరుగా తాను కమిషనర్ అనుమతి తీసుకున్నట్లు పేర్కొనడం విశేషం. ఇంజినీరింగ్ విభాగానికి అధిపతి అయిన సూపరింటెండెంట్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈ జాబితా తయారు చేసిన గుమాస్తాకు కానీ, మున్సిపల్ కార్పొరేషన్ అధిపతి అయిన కమిషనర్ ఉత్తర్వులు గానీ లేకుండానే సదరు డిఈఈ అనధికారికంగా వార్డు అమినిటీ సెక్రటరీ నియమించుకుని ఫైళ్లను నడుపుతుండటం విస్మయానికి గురి చేసే అంశం. ఇలా దాదాపు రెండు నెలలకు పైగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి సంవత్సరం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగే వార్షిక ఆడిటింగ్‌లో ఈడి ఈఈ నిర్వాకాలు వెలుగు చూస్తే మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిష్టకు భంగం వాటిల్లే అవకాశం మెండుగా ఉంటాయనే ఆ శాఖ ఉద్యోగులే బహిరంగంగా చెబుతున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ముగ్గురు అధికారుల నడుమ తీవ్ర విభేదాలు నెలకొని ఉండటంతో అవి ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా వాటిని నిరోధించే దిశగా కఠిన చర్యలు చేపట్టకపోవడం పాలనా దుస్థితిని చెప్పకనే చెప్పినట్లు అవుతోంది. మోనార్కులా వ్యవహరించే సదరు అధికారిని తనకు నచ్చిన వ్యక్తులతోనే పనులు అప్పగిస్తూ చేయిస్తున్నరనే విమర్శలు ఉన్నాయి. ఇంత జరిగినా ఉన్నతాధికారులకు ఈ విభాగంలో జరుగుతున్న అనధికార వ్యక్తుల ప్రమేయాలను నిరోధించలేకపోవటం మరిన్ని విమర్శలకు తావిస్తోంది.



ఎమ్మెల్యేగా డిక్లరేషన్ తీసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతున్న దగ్గుపాటి ప్రసాద్

అనంత ప్రజల రుణం తీర్చుకుంటా

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

టిడిపి అధినేత చంద్రబాబుపై ప్రజలు పెట్టుకున్న నమ్మకంతోనే తమను భారీ మెజారిటీతో తాము గెలుపొందామని అనంతపురం అర్బన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దగ్గుపాటి ప్రసాద్ తన సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డిపై 23,023 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొదటి రౌండ్ నుంచే దగ్గుపాటి ఆధిక్యత కనబరుస్తూ ప్రతిరౌండ్‌లో మెజారిటీ సాధించారు. దగ్గుపాటికి 1,03,334 ఓట్లు రాగా వైసిపి అభ్యర్థికి 94,169 ఓట్లు వచ్చాయి. 23023 ఓట్ల మెజారిటితో ఘన విజయం సాధించారు. ఎమ్మెల్యేగా గెలిచి, డిక్లేరేషన్ పత్రాన్ని అందుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంత అభివృద్ధికి తీసుకునే చర్యల గురించి వివరించారు. తన విజయానికి కష్టపడి పని చేసిన టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అనంతపురం నియోజకవర్గం ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి సునామి సృష్టించి అధినేత నారా చంద్రబాబు నాయుడు నాల్గవ సారి రాష్ట్ర ముఖమంత్రిగా పరిపాలన చేయనుండటం, వారి నేతృత్వంలో తాము పాలు పంచుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు. తాను ఇంటింటికి తిరిగి ప్రచారం చేసినప్పుడు ప్రజలు ఎంతో అప్యాయత అనురాగాలతో స్వాగతం పలికి ముందుకు నడిపారని, ఎమ్మెల్యేగా గెలిపించి బాధ్యతను పెంచారని తెలిపారు. తాను ఇచ్చిన హామీలు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, డంపింగ్ యార్డ్ తరలింపు, తాగునీరు, రోడ్ల పునర్ నిర్మాణం, వంటి హామీలన్ని అమలు చేసి నియోజకవర్గం ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు.



అను నేను...

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జూన్ 21 తేదీన ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో అసెంబ్లీలో ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణంచేశారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.


హోంమంత్రి అనితకు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్


ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్


అనంతపురం పెద్దాసుపత్రిలో బాలింతను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి


స్పీకర్ అయ్యన్నపాత్రుడికి బొకే అందజేస్తూ..


ఎస్పీ గౌతమిసాలికి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి


ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను సన్మానిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది


ఆర్ట్స్ కళాశాల మైదానంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి


వికలాంగుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి


ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సిరిగుప్ప వెంకటేష్


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి


ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను సన్మానిస్తున్న తెలుగు మహిళలు


పింఛన్ పెంపు సందర్భంగా చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి


రామ్‌నగర్‌లో పారిశుధ్యంపై ఇంజినీర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి


ఎమ్మెల్యేకు పూల మొక్క అందజేసున్న కమిషనర్ మేఘస్వరూప్



40వ డివిజన్‌లో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


ఎమ్మెల్యేను అభినందిస్తున్న జనసేన నాయకులు


సెంట్రల్ పార్కుస్థలం ఆక్రమణపై టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


పెద్దాసుపత్రిలో సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఎంపీ


నగరంలో పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి


ఎమ్మెల్యేకు బొకే అందజేస్తున్న ప్రజాశక్తి దినపత్రిక సిబ్బంది



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి



ఆక్రమణ స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రభుత్వాసుపత్రికి బడ్జెట్ పెంచాలి

జెడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని పెద్దాసుపత్రికి బడ్జెట్ పెంచాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంగళవారం నిర్వహించిన తొలి జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి తక్కువ బడ్జెట్ విడుదల చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సర్వజనాసుపత్రికి రోజుకు 12వందల నుంచి 14వందల వరకూ పేషెంట్లు వస్తున్నారని, దీనికితోడు సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి సేవలు కూడా ప్రారంభమయ్యాన్నారు. కావున నిధులు పెంచి ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. మరోవైపు జిల్లాలో ప్రజా సమస్యలు ఉండగా.. అధికారులు, జడ్పీ ఛైర్‌పర్సన్ ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ చర్చ సరిగా సాగడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో ఏం అభివృద్ధి పనులు చేశారో చెప్పాలన్న డిమాండ్ చేశారు.

కార్పొరేషన్ స్థలాల ఆక్రమణకు అడ్డుకట్ట వేస్తాం
ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

నగరంలోని సెంట్రల్ పార్కు ఆక్రమణ లపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం నగరంలోని సెంట్రల్ పార్క్ ఆక్రమణలతోపాటు వేణుగోపాల్ నగర్‌లోని ఎన్టీఆర్ మార్గ రోడ్డు, తదితర ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం అండతో వైసీపీ నాయకులు సెంట్రల్ పార్క్ స్థలాన్ని ఇష్టానుసారంగా కబ్జా చేశారన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. అలాగే సెంట్రల్ పార్కు స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇక ఎన్టీఆర్ మార్గ్ రహదారి సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. 15 ఏళ్లుగా ఎన్టీఆర్ మార్గ్ రహదారి సమస్యకు పరిష్కారం చూపి, ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరుస్తామని వివరి ంచారు. రోడ్డును ఆక్రమించిన కట్టడాలను పట్టణ ప్రణాళిక అధికారుల ఆధ్వర్యంలో కూల్చివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.